సాక్షి వనపర్తి

శుక్రవారం । 17 । నవంబర్ । 2023



సమస్యల అడ్డా!

జడ్చర్లలో అనేక సమస్యలు తిష్టవేయగా.. ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు.

వివరాలు 10లో ▸



ఏదుల ప్రాజెక్టు పరిశీలన

ఏదుల జలాశయం టేకాఫ్ స్లూయిస్ పనులను సీఈ హమీద్‌ఖాన్ పరిశీలించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /22.4

వాతావరణం

ఉదయం, సాయంత్రం చలితీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రికి దట్టమైన మేఘాలు కమ్ము కుంటాయి. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు



వనపర్తిటౌన్: కురుమూర్తిస్వామి జాతర పుర స్కరించుకొని ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు వనపర్తి డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని డిపో పరిధిలో ప్రత్యేక బస్సుల స్టిక్కర్లను విడుదల చేసి మాట్లాడారు. వనపర్తి డిపో నుంచి కొత్త కోట మీదుగా ఆలయం వరకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. 18న 5 బస్సులు, ఆదివారం ఉద్దాల రోజు రద్దీకి అనుగుణంగా 15 నిమిషాలకు ఒకటి చొప్పున నడపనున్నట్లు చెప్పారు. భక్తులు సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు సాధారణ అమ్మకాలే..

బిజినేపల్లి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన తిమ్మాజీపేట మద్యం డిపో నుంచి ఎన్ని కల కోడ్ సందర్భంగా సాధారణ అమ్మకాలే ఉం టాయని, సాధారణ అమ్మకాలకు మించి ఎక్కువ మద్యం సరఫరా చేయమని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దత్తురాజుగౌడు అన్నారు. గురువారం ఆయన తిమ్మాజీపేట మద్యం డిపోను సందర్శించి రికార్డులు, మద్యం నిల్వ లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో బెల్టు షాపులను నియంత్రించామని, స్థానిక ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు కొనసాగుతాయ న్నారు. మద్యం సరఫరాపై తమ శాఖ నుంచి ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఈ సందర్భం గా ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ అనుదీప్, తిమ్మాజీపేట డిపో మేనేజర్ లచ్చయ్య తదితరులున్నారు.

సోనామసూరి క్వింటా రూ.2,439

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం జరిగిన ఈనామ్ టెండ ర్లలో సోనామసూరి ధాన్యం క్వింటాల్‌కు గరి ష్టంగా రూ.2,439, కనిష్టంగా రూ.1,929 ధరలు నమోదయ్యాయి. అలాగే హంస క్విం టాల్‌కు గరిష్టంగా రూ.1,882, కనిష్టంగా రూ.1,761 ధరలు లభించాయి. మార్కెట్‌కు 8 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

వేరుశనగ క్వింటా రూ.7,990

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యా ర్డుకు గురువారం 1,658 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.7,990, కనిష్టం రూ.3,112, సరాసరి రూ.5602 ధరలు పలికాయి. అలాగే, 105 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్టం రూ.5390, కనిష్టం రూ.4010, సరాసరి రూ.5280 ధరలు వచ్చాయి. దీంతోపాటు 1,177 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2402, కనిష్టం రూ. 2162, సరాసరి ధర రూ. 2369 ధరలు పలికాయి.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కొత్తకోట రూరల్: బైక్ పైనుంచి పడి మహిళ మృతిచెందిన ఘటన కొత్తకోట సమీపంలో జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. పెబ్బేరు మండలం కంచిరావుపల్లి తండాకు చెందిన ముత్యాలమ్మ (48) భర్త పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేది. మండలంలోని విలియంకొండతండాలో బం ధువుల ఇంట్లో శుభకార్యానికి కుమారుడు రాత్లావత్ నీలపురితో కలిసి బైక్‌పై హైదరా బాద్ నుంచి వచ్చింది. కార్యక్రమం ముగిం చుకొని తిరిగి వెళ్తుండగా కొత్తకోట బైపాస్ సమీపంలో వెనుక కూర్చున్న ముత్యాలమ్మ ప్రమాదవశాత్తు కిందపడటంతో అక్కడిక క్కడే మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

నేడు

మహబూబ్‌నగర్‌కు 'బండి'



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ శుక్రవారం మహబూబ్‌నగర్‌కు రానున్నారు. హైదరాబాద్ నుంచి హెలీకా ప్టర్‌లో బయలుదేరనున్నారు. జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం 11 గంటలకు చేరుకోనున్నారు. అక్కడి నుం చి రోడ్డు మార్గంలో బొక్కలోనిపల్లి చౌరస్తాకు వెళ్లి కార్నర్ మీటింగ్‌లో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు వన్‌టౌన్ చౌరస్తా, పాత గ్రంథాలయం, పాన్‌చౌరస్తా మీదుగా క్లాక్‌టవర్ చేరుకోనున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో బీజేపీ శ్రేణులు, ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు.

నేడు

2 చోట్ల బీఎస్పీ సభలు



బీఎస్పీ రాష్ట్ర అధ్య క్షుడు ఆర్‌ఎస్ ప్రవీ ణ్‌కుమార్ శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని రెం డు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. హెలీ కాప్టర్ ద్వారా ముందుగా అలంపూర్ నియో జకవర్గ పరిధిలోని అయిజ పట్టణంలో ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ సమీపంలోని మైదానా నికి చేరుకోనున్నారు. అక్కడ ఏర్పాటు బహు జన ఆశీర్వాద సభలో మాట్లాడనున్నారు. ఆ తర్వాత నాగర్‌కర్నూల్‌కు చేరుకుని జెడ్పీ మైదానంలో నిర్వహించనున్న సభకు హాజ రుకానున్నారు.

19న

సీఎం కేసీఆర్.. 4 సభలు



బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈ నెల 19న ఉమ్మడి జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలకు హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో బయ లుదేరి ముందుగా అలంపూర్, ఆ తర్వాత వరుసగా నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లా పూర్ సభల్లో ప్రజలనుద్దేశించి మాట్లాడను న్నారు. మళ్లీ 22న చివరగా మహబూబ్‌న గర్, కోస్గిలో నిర్వహించే సభలో పాల్గొ ననున్నారు.

రేపు

గద్వాలకు 'బాద్‌షా'



బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శనివారం గద్వాలకు రానున్నారు. పార్టీ అభ్యర్థి బోయ శివారెడ్డికి మద్దతుగా గద్వాల జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తా గంజిరోడ్డు మైదానంలో నిర్వహించనున్న సకల జనుల విజయ సంకల్పసభకు హాజరుకాను న్నారు. ఉదయం పది గంటలకు సభ ప్రారంభం కానుండగా.. ఈ మేరకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

19న పేటకు నడ్డా..



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 19న నారాయణపేట అభ్యర్థి రతంగ్ పాండురెడ్డికి మద్దతుగా నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించ నున్న సభలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారు.

పోరు.. జోరు!

పాలమూరుకు అగ్రనేతల రాక

- ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా సభలు
- నేడు పర్యటించనున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి
- మహబూబ్‌నగర్‌లో 2 చోట్ల కార్నర్ మీటింగ్‌లు
- రేపు గద్వాలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా
- 19న సీఎం కేసీఆర్.. 4 చోట్ల ప్రజా ఆశీర్వాద సభలు
- ఉమ్మడి జిల్లాలో హోరెత్తనున్న ప్రచారం



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: నామినేషన్ల ఉప సంహరణ ఘట్టం ముగియడంతో ఉమ్మడి పాల మూరులో ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీ లైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు తమ తమ నియోజకవర్గాల పరిధిలోని పట్టణాలు, పల్లెల్లో వాడవాడలు, ఇంటింటికీ తిరుగుతూ గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గ్రామ, పట్టణ కూడళ్లలో ఆరోపణలు–ప్రత్యారోపణలు, విమర్శలు–ప్రతివిమర్శలతో రాజకీయ వాతావ రణం ఇప్పటికే వేడెక్కింది. ఈ క్రమంలో ఆయా అభ్యర్థులకు మద్దతుగా ఆయా పార్టీల జాతీయ, రాష్ట్ర స్థాయి ముఖ్యనేతలు, స్టార్ క్యాంపెయినర్లు ఉమ్మడి జిల్లాను చుట్టేయనున్నారు. బీఆర్‌ఎస్ అధి నేత సీఎం కేసీఆర్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ రానున్నారు. అదేవిధంగా కాంగ్రెస్‌కు చెందిన వివిధ రాష్ట్రాల ముఖ్య నేతలు త్వరలో ఉమ్మడి జిల్లాలో పర్యటించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోరు మరింత జోరందుకోనున్నట్లు తెలుస్తోంది.

హేమాహేమీలతో ప్రచారం..

బీఆర్‌ఎస్‌లో జోష్

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించక ముందు నుంచే బీఆ ర్‌ఎస్ అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రజల్లోకి చొచ్చుకెళ్తున్నారు. అభ్యర్థుల గెలుపే లక్ష్యం గా ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పట్టణాభి వృద్ధి శాఖ మంత్రి కేటీఆర్‌తో పాటు రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దేవరకద్ర, కొడంగల్‌లో పర్యటించారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో జడ్చర్ల, అచ్చంపేట, వనప ర్తి, దేవరకద్ర, మక్తల్, గద్వాల, నారాయణపేట సభల్లో పాల్గొన్నారు. తాజాగా ఈ నెల 19న, 22న మళ్లీ రానుండగా.. ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

బీజేపీ కదం

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట, మక్తల్, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాలపై బీజేపీ ప్రధానంగా ఫోకస్ పెట్టిం ది. అక్టోబర్ 1న మహబూబ్‌నగర్‌లో పాలమూరు ప్రజాగర్జన సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఎన్నికల శం ఖారావం పూరించారు. ఆ తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నాగర్‌కర్నూల్ సభకు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకటన తర్వాత ఆ పార్టీ ముఖ్య నేతలు కిషన్‌రెడ్డి, ఈటల, బండితో పాటు కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు తరచుగా జిల్లాలో పర్యటిస్తూ తమ అభ్యర్థులకు మద్ద తుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. తాజాగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గద్వాలకు రానున్నారు. బండి సంజయ్ సైతం మహబూబ్‌నగర్‌కు రానుండగా ఆ పార్టీలో ఉత్సాహం నెలకొంది.

కాంగి'రేసు'..

ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనే తలు రంగంలోకి దిగారు. ఇప్పటికే కొల్లాపూర్ సభతో పాటు కల్వకుర్తి, జడ్చర్ల కార్నర్ మీటింగ్‌లో రాహుల్‌గాంధీ పాల్గొన్నారు. కొడంగల్, మక్తల్, గద్వాల, అలంపూర్‌లో నిర్వహించిన సభలకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. త్వరలో కాంగ్రెస్‌కు కర్ణాటక సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితర నేతలు ఉమ్మడి జిల్లాలో పర్యటించేలా సన్నాహాలు చేస్తున్నారు.

జంగ్ తెలంగాణ

ఖర్చు లెక్కలు విధిగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న సాధారణ ఎన్నికల పరిశీలకుడు సోమేష్ మిశ్రా

జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సోమేష్ మిశ్రా

వనపర్తి: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు చేసే ఖర్చును విధిగా ఎన్నికల ఖర్చుల పద్దులో నమోదు చేయాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సోమేష్ మిశ్రా సూచించారు. గురువారం కలెక్టరే ట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు పరిశీ లకుడు రాజీవ్ మల్హోత్రా, వ్యయ పరిశీలకుడు రాజేందర్‌సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్, ఎస్పీ రక్షిత కె.మూర్తితో కలిసి ఎన్ని కల్లో పోటీ చేసే అభ్యర్థులు, వారి తరుపున హాజరైన ప్రతినిధులతో ఎన్నికల కోడ్ అమలుపై సమీక్ష నిర్వహించారు. అభ్యర్థులు చేసే ఎన్నికల ఖర్చుల లెక్కల నిర్వహణ పద్ధతులను ఆయన వివ రించారు. అభ్యర్థి నామినేట్ చేసిన తేదీ నుంచి బ్యాంకు ఖాతా ద్వారా సరైన లెక్కలు చూపించా లన్నారు. పూర్తి లెక్కలు ఎన్నికల ఫలితాలు ప్రకటిం చిన 30 రోజుల్లోపు సమర్పించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ఖర్చుకు లోబడే ఉం డాలని, ఖర్చు రోజు నమోదు చేసి సమర్పించాల న్నారు. ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సి-విజిల్ యాప్ పనితీరు వివరించారు. జిల్లాలో ఎఫ్‌ఎస్‌టి, ఎస్‌ఎస్‌టి, వీఎస్‌టి బృందాలు నిరంతరం పర్యటి స్తుంటాయని.. ఎక్కడైనా ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరిం చారు. జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ..

నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్ని కలు నిర్వహించేందుకు కావాల్సిన చర్యలు తీసుకుం టున్నామని సాధారణ ఎన్నికల పరిశీలకుడు సోమేష్ మిశ్రా తెలిపారు. గురువారం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులతో నిర్వహిం చిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని వనపర్తి వివరాలు వెల్లడించారు. ఎన్నికల ప్రత్యేక బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని.. సి-విజిల్ యాప్‌పై ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఓటరుకు ఇన్ఫర్మేషన్ స్లిప్ అందించేందుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. పోలీసు పరిశీలకుడు రాజీవ్ మల్హోత్రా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎలాం టి ఇబ్బందులు లేవని.. ఎన్నికల సంఘం నిబంధ నల మేరకు పోలింగ్ జరిగేలా చూస్తామని చెప్పారు. ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాజేంద్రసింగ్ మాట్లాడుతూ.. ఎస్‌ఎస్‌టి, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎన్‌ఫో ర్స్‌మెంట్ బృందాలు పకడ్బందీగా పనిచేస్తున్నాయ ని.. ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

రెండో ర్యాండమైజేషన్ విజయవంతం



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

వనపర్తి: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండో ర్యాండమైజేషన్‌ను విజయవంతంగా పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్ వెల్లడించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాల్‌లో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సోమేష్ మిశ్రా సమక్షంలో వెబ్ ద్వారా రెండో ర్యాండమైజే షన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గానికి పోలింగ్ సిబ్బందిని కేటాయించామని, మూడో ర్యాండమైజే షన్ ద్వారా సిబ్బందికి పోలింగ్ కేంద్రాల కేటాయిం పు ఉంటుందని వివరించారు. నియోజకవర్గంలోని 296 పోలింగ్ కేంద్రాలకు 20 శాతం అదనపు సిబ్బం దితో కలిపి 347 మంది పీఓలు, 347 ఏపీఓలు, ఒక్కో పీఎస్‌కు ఇద్దరు చొప్పున ఓపీఓలతో బృందా లను కేటాయించినట్లు తెలిపారు. ఎన్నికల సిబ్బం దికి మూడోవిడత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

శేషవాహనంపై ఊరేగిన కురుమూర్తిస్వామి



బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కురుమూర్తిస్వామి పద్మావతిదేవి సమేతంగా శేషవాహనంపై ఊరేగారు. ప్రధాన ఆలయం నుంచి మోకాళ్ల గుండు వరకు విహరించగా.. గోవింద నామస్మరణతో ఏడుకొండలు మారుమోగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మదనే శ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కమిటీ సభ్యుడు నాగరాజు, గ్రామస్తులు బాలరాజు, భాస్కర్, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

– చిన్నచింతకుంట

ఉపన్యాస పోటీలతో సృజనాత్మకత పెంపు



విజేతలతో సెక్టోరియల్ అధికారులు, ఉపాధ్యాయులు

వనపర్తిటౌన్: ఉపన్యాస పోటీలతో విద్యార్థుల్లో సృ జనాత్మకత పెంపొందుతుందని సెక్టోరియల్ అధి కారులు శేఖర్, యుగంధర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బాలభవన్‌లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞానం ప్రతిష్ఠ, సిద్ధార్థ యోగ విద్యాలయ, డా. రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్ అం డ్ తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం ఆధ్వ ర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఉపన్యాస పోటీ లను వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 28న జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్క రించుకొని 'మానవ జీవన విధానంపై ప్రకృతి ప్రభావం' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వ హించామని, పోటీల్లో జిల్లాలోని వివిధ మండలాల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. బి.కృష్ణవేణి (జెడ్పీహెచ్‌ఎస్, అప్పరాల) ప్రథమ స్థానంలో నిల వగా రూ.3 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. ద్వితీయ బహుమతిని ఎం.ఉదయ్‌కి రణ్ (జెడ్పీహెచ్‌ఎస్, బలిజపల్లి) సాధించగా రూ.2 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా ప్రతం, తృతీయ బహుమతిని పి.అనూష (జెడ్పీహెచ్‌ఎస్, పెద్దమారూర్) రూ.వెయ్యి నగదు, జ్ఞాపిక, ప్రశం సాపత్రం అందజేశారు. 18న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచిపేరు తీసు కురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధా నోపాధ్యాయురాలు సునీత, సాంఘికశాస్త్ర ఉపా ధ్యాయుల ఫోరం జిల్లా అధ్యక్షుడు భగవంతు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యదర్శులు అను రాధ, దేవన్న, సుంకన్న, శ్రీనివాస్‌గౌడ్, రాధ, రామ కృష్ణ, లక్ష్మి, స్వామి, సుధారాణి పాల్గొన్నారు.

వైభవంగా బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనలు



పూజల్లో పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగులశాఖ చైర్‌పర్సన్ రజనీసాయిచంద్

అమరచింత: పట్టణంలో మూడురోజులుగా కొన సాగుతున్న బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురు వారం ముగిశాయి. అర్చకులు వేద మంత్రోచ్ఛార ణల నడుమ హోమం నిర్వహించి బొడ్రాళ్లకు ప్రాణ ప్రతిష్ఠ చేసి పట్టణంలోని 10 చోట్ల భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఆడపడుచులతో పాటు మహిళలు రాగి కలశాల్లో నీరు తీసుకొచ్చి అభిషేకించారు. కార్యక్రమానికి రాష్ట్ర గిడ్డంగులశాఖ చైర్‌పర్సన్ రజ నిసాయిచంద్, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతో పాటు పల వురు ప్రముఖులు హాజరై పూజలు నిర్వహించారు. మాజీ అడ్వొకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి, నెల్లికొండి దేవేందర్‌రెడ్డి, మాకం శ్రీనివాస్‌తో పాటు గౌడ సంఘం ఆధ్వ ర్యంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ జగన్మోహన్ సిబ్బందితో బం దోబస్తు నిర్వహిం చారు. నిర్వాహకులు విష్ణువర్ధన్‌రెడ్డి, తాటి కొండ రమేష్, శివాజీ, కుమ్మరి శ్రీని వాసులు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దాదాసాహెబ్ ఖోగరే

శాంతినగర్: వ్యవసాయరంగంలో ఆధునిక వ్యవ సాయ పద్ధతులు ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు దాదాసాహెబ్ ఖోగరే, డాక్టర్ భవానిలు అన్నారు. వడ్డేపల్లి ఐకేపీ సమావేశ మందిరంలో ఎంపీడీఓ రవీంద్ర అధ్యక్షతన గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా రైతులకు, ఉపాధి కూలీలకు వ్యవసాయంలో మెలకువలు, పంటలకు సోకే తెగుళ్లు, ఎరువుల వాడకం గురించి వివరిం చారు. మట్టి సాంద్రత, ఏ రకం మట్టిలో ఎలాంటి పంటలు సాగుచేయాలి, ఎలా పండించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డా.భవాని వర్మీ కంపోస్టు తయారీపై శిక్షణ ఇచ్చారు.

ఉపాధి కూలీలకు శిక్షణ..

ఉపాధి పనుల్లో వంద రోజులు పూర్తిచేసిన కూలీలకు గురువారం శిక్షణ తరగతులు ప్రారంభిం చారు. అనంతరం ఎంపీడీఓ రవీంద్ర మాట్లాడుతూ డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు ఉపాధి కూలీలకు ఈనెల 16 నుంచి డిసెంబర్ 2 వరకు 15 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కార్యక్రమంలో వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెం దిన 100 మంది కూలీలు పాల్గొంటారన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ, మేలు రకం వం గడాల సాగు, ఆధునిక పద్ధతులపై శిక్షణ వుంటుం దని, ఉమ్మడి మండలాలకు చెందిన 100 మంది తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

నవోదయలో ఆకట్టుకున్న యూత్ పార్లమెంట్



పార్లమెంట్ సమావేశం నిర్వహిస్తున్న విద్యార్థులు

బిజినేపల్లి: మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం పార్లమెంట్ వ్యవహారాల శాఖ, నవోదయ విద్యాలయ సమితి సంయుక్తంగా నిర్వహిం చిన యూత్ పార్లమెంట్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు పార్లమెంట్‌లో జరిగే సమావేశాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. విద్యార్థులు ప్రధాన మంత్రి, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ఆయా శాఖల మంత్రులు, ప్రతిపక్ష నాయకుల ప్రాతలు పోషించి మెప్పించారు. ముందుగా నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించి మంత్రులుగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జపాన్ పార్లమెంటరీ ప్రతినిధుల పరి చయం, ప్రశ్నోత్తరాలు, వన్ నేషన్– వన్ ఎలక్షన్, మహిళా బిల్లులకు ఆమోదం తెలపగా.. మణిపూర్ అల్లర్లపై ప్రతిపక్ష నాయకుల నిలదీత, వాటి సమా ధానాలతో అలరించారు. అనంతరం విద్యాలయ ప్రిన్సిపల్ భాస్కర్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ జానకి, యూత్ పార్లమెంట్ కన్వీనర్ భాస్కరాచారి మాట్లా డుతూ విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు, నాయకత్వ లక్షణాలు పెంపొందిం చడానికి ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో దోహద పడతాయన్నారు.





మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీనపరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండి.
- స్వామి వివేకానంద

ఎస్‌ఎస్‌జీ ఖాతాలపై ఈసీ నజర్



గ్రామాల్లో గెలుపోటములను ప్రభావితం చేసే సత్తా మహిళా సంఘాలకు ఉంది. సంఘాలను ప్రసన్నం చేసుకుంటే తమ గెలుపు నల్లేరుపై నడకేనని భావించిన వివిధ పార్టీల అభ్యర్థులు.. మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసీ అప్రమత్తమైంది. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు సంఘాల ఆర్థిక లావాదేవీలు నిర్వహించే బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తోంది. మహిళా సంఘాలు పొదుపు చేసుకునే, రుణాలు తీసుకునే బ్యాంకు ఖాతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. స్త్రీనిధి రుణాలు, వివిధ వ్యాపారాల మీద కమీషన్లు, బ్యాంకుల్లో నిల్వ ఎంత ఉందనే లెక్కలను సేకరిస్తోంది. ప్రభుత్వం నుంచి వచ్చే రుణాలు మినహా ఇతర డబ్బులు వారి ఖాతాల్లో జమ అయినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకోనుంది.

- జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)

ఎన్నికల బరిలో భూత్పూర్ వాసులు

భూత్పూర్: భూత్పూర్ మండలానికి చెందిన నలుగురు అభ్యర్థులు దేవరకద్ర అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. అన్నాసాగర్‌కు చెందిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా, భూత్పూర్‌కు చెందిన గడ్డం ఎల్లప్ప ప్రజా ఏక్తా పార్టీ నుంచి పోటీ చేస్తున్నారు. కర్వెనకు చెందిన బి.జంగయ్య ధర్మ సమాజ్ పార్టీ నుంచి, పాతమొల్గరకు చెందిన మందడి వెంకటనర్సింహారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచారు.

రూ.7.75 లక్షలు సీజ్

నారాయణపేట రూరల్/ఊర్కొండ/గద్వాల క్రైం: నారాయణపేట జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.4లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. నారాయణపేట పీఎస్ పరిధిలో ఒక వాహనంలో రూ.1,48,000, మరో వాహనంలో రూ.70వేలు పట్టుకున్నట్లు వెల్లడించారు. మక్తల్ పీఎస్‌లో రూ.2లక్షల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

- నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ముచ్చర్లపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.65వేల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. బాలానగర్‌కు చెందిన వస్పుల యాదయ్య ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా, స్వాధీనం చేసుకుని జిల్లా అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.
- గద్వాల పట్టణ శివారులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.3.10లక్షల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు.



మధుమేహంపై వైద్యశిబిరం

పాలమూరు: ప్రపంచ మధుమేహం దినోత్సవం సందర్భంగా గురువారం ఎస్వీఎస్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్వీఎస్ రెసిడెన్షియల్ డైరెక్టర్ రాంరెడ్డి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 76మంది మహిళలు, 62మంది పురుషులకు మధుమేహం ఇతర సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలను జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ నిషాంత్ రోగులకు వివరించారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ ఉమేష్, శంకర్ పాల్గొన్నారు.

జడ్చర్ల.. సమస్యల అడ్డా!



నత్తనడకన సాగుతున్న సిగ్నల్‌గడ్డ రోడ్డు విస్తరణ పనులు

- దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని సిగ్నల్‌గడ్డ
- ఆర్‌యూబీ లేక నిలిచిన రాకపోకలు
- ట్రాఫిక్ సమస్యతో సతమతం
- 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్‌లో పలు సమస్యలు వెలుగులోకి..

గ్రౌండ్ రిపోర్ట్

జడ్చర్ల: ఒకవైపు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉండి.. మరోవైపు 44, 167 నంబర్ల జాతీయ రహదారులకు కేంద్రంగా ఉన్న జడ్చర్ల నియోజకవర్గంలో అనేక సమస్యలు తిష్టవేశాయి. ప్రజలు కనీస సౌకర్యాలకు నోచుకోవడంలేదు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాబోయే ఎమ్మెల్యేకు పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జడ్చర్ల సెగ్మెంట్‌లో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పురపాలికకు సొంత భవనం కరువు..

జడ్చర్ల మున్సిపల్ కార్యాలయానికి సొంత భవనం కరువయ్యింది. బాదేపల్లిలో ఉన్న పాత భవనాన్ని కూల్చివేసి కావేరమ్మపేటలోని పాత గ్రామపంచాయతీ భవనానికి కార్యాలయాన్ని తరలించారు. దీంతో వివిధ పనుల నిమిత్తం బాదేపల్లి వాసులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి రావాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారు. రూ.3కోట్లతో మున్సిపల్ కార్యాలయ భవనానికి శ్రీకారం చుట్టినా పనుల్లో ప్రగతి కనిపించడంలేదు.

చెట్ల కిందే సమావేశాలు..

పట్టణ మహిళా సంఘాలకు సొంత భవనం లేదు. దీంతో బాదేపల్లి మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని రావిచెట్టు కింద కూర్చుని సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. బాదేపల్లిలో దాదాపు 550 మహిళా సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10మంది సభ్యులు ఉన్నారు. ఈ లెక్కన మొత్తం 5,500మంది సభ్యులు పట్టణ మహిళా సంఘంలో కొనసాగుతున్నారు. వీరి తరఫున పట్టణ మహిళా సంఘంలో 60మంది మహిళలు ప్రతినిధులుగా కొనసాగుతున్నారు.

స్టేడియం అభివృద్ధి అంతంతే..

పట్టణంలోని డాక్టర్ బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు అనుబంధంగా దాదాపు ఐదెకరాల విస్తీర్ణంలోగల స్టేడియం అభివృద్ధికి నోచుకోలేదు. స్టేడియానికి దాదాపు రూ.కోటి నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగలేదు. దీంతో క్రీడాకారులు, వాకర్స్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రంవేళల్లో వాక్కింగ్ కోసం ప్రజలు పెద్దఎత్తున స్టేడియానికి వస్తుంటారు. సెలవు రోజుల్లో స్టేడియం మొత్తం కిటకిటలాడుతోంది.

నత్తనడకన ఆర్‌యూబీ పనులు..

జడ్చర్ల రైల్వేస్టేషన్ సమీపంలో ఆర్‌యూబీ (రైల్వే అండర్‌బ్రిడ్జి) పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇక్కడ ఆర్‌యూబీ నిర్మించాలని రెండు దశాబ్దాలుగా ప్రజలు కోరుతున్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఏడాది కిందట రైల్వేగేటును పూర్తిగా మూసివేయడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పాతబజార్, బూరెడ్డిపల్లి, ఆలూరు గ్రామాలతో పాటు గిరిజన తండాలవారు సిగ్నల్‌గడ్డ మీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది.

కలగా మారిన బైపాస్..

జడ్చర్ల పట్టణానికి బైపాస్ రోడ్డు లేకపోవడంతో పట్టణం నడిబొడ్డు మీదుగానే వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. రెండు జాతీయ రహదారులతో పాటు అంతర్‌రాష్ట్ర రహదారులు సైతం ఉండటంతో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా బాలానగర్ మండలంలోని పెద్దరేవల్లి, బోడజానంపేట ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. సీసీరోడ్లు, డ్రెయినేజీలను పూర్తిస్థాయిలో నిర్మించాల్సి ఉంది.

సిగ్నల్‌గడ్డలో నరకయాతన..

జడ్చర్లకు గుండెకాయలాంటి సిగ్నల్‌గడ్డ ప్రాంతం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదు. మూడు రోడ్ల కూడలిగా ఉన్న సిగ్నల్‌గడ్డ ప్రమాదాలకు నిలయంగా మారింది. సింగిల్ రైల్వేబ్రిడ్జిపైనే రాకపోకలు సాగించాల్సి రావడంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎంతో మంది ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు. ప్రజల ఆందోళనతో ఆరునెలల కిందట రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాగా.. మందకొడిగా సాగుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో అంబేద్కర్ చౌరస్తావైపు పాత రోడ్డుపైనే బీటీ వేసి కాస్త ఉపశమనం కలిగించారు.

సమస్యలు పరిష్కారం కావడంలేదు..



జడ్చర్ల పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడంలేదు. సమస్యల పరిష్కారంపై పాలకులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు. సొంత ప్రయోజనాలకు మాత్రమే పురపాలిక మండలి పరిమితమైంది. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పట్టణ అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి.

– అనిల్‌కుమార్, సామాజికవేత్త, జడ్చర్ల

బైపాస్‌రోడ్డు లేక ఇబ్బందులు..



పట్టణానికి బైపాస్ రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి రెండు వైపులా జాతీయ రహదారులు ఉండటంతో వాహనాల రద్దీ తీవ్రంగా ఉంటుంది. అన్ని వైపుల నుంచి వచ్చే వాహనాలు పట్టణం నడిబొడ్డు మీదుగానే వెళ్లాల్సి రావడంతో పట్టణవాసులకు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది.

– సత్తయ్య, జడ్చర్ల

అసంపూర్తిగా సమీకృత మార్కెట్..



సమీకృత మార్కెట్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. కూరగాయలు, మాంసం, చేపలు ఇతర నిత్యావసర సరుకులన్నీ ఒకేచోట లభించేలా ప్రభుత్వం రూ.4.50 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండేళ్ల కిందట పనులు మొదలుపెట్టినా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

మూతపడిన రైతుబజార్..

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో ఐదేళ్ల కిందట రూ.3.75 కోట్లతో అన్ని హంగులతో నిర్మించిన రైతుబజార్ నిరుపయోగంగా మారింది. ఇక్కడ దాదాపు 50మంది రైతులు వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకునే విధంగా నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా ఆరుబయట 15 దుకాణాల సముదాయం నిర్మించారు. ఇక్కడ కూరగాయల క్రయవిక్రయాలు సాగకపోవడంతో మూతపడింది.



ఎన్నికల సిత్రాలు..

వడలు మీకు.. ఓట్లు నాకు..



మహబూబ్‌నగర్ పట్టణంలోని ఓ హోటల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వేడివేడిగా వడలు తయారు చేసి అక్కడున్న వారికి పంచిపెట్టారు.

- మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

నమస్కారానికి.. ప్రతి నమస్కారం



వనపర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి నిరంజన్‌రెడ్డి ఖిల్లాఘనపురం మండలంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ వృద్ధురాలికి మంత్రి నమస్కరిస్తూ ఓటు అభ్యర్థించగా.. ఆమె ప్రతి నమస్కారం చేసి ఆకట్టుకున్నారు.

- ఖిల్లాఘనపురం

చిన్నారికి లాల.. పెద్దలకు వల



పరిగి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి గండేడ్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ చిన్నారికి స్నానం చేయించి పెద్దలకు ఓట్ల వల విసిరారు.

- గండేడ్

గుర్తు.. గుర్తుంచుకో..



కొడంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కోస్గి పట్టణంలో ఓ వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరించి, కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

- కోస్గి

ఆడుతూ.. పాడుతూ..



కొల్లాపూర్ సెగ్మెంట్‌లోని పెంట్లవెల్లి మండలం ఎంగంపల్లి తండాలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి గిరిజన మహిళలతో కలిసి ఆడిపాడి ఆకట్టుకున్నారు.

- పెంట్లవెల్లి

వాట్సప్ కాల్సే బెటర్

- కాల్ రికార్డింగ్‌తో తంటాలు

అడ్డాకుల: మొబైల్ ఫోన్‌లో ఎన్నికల గురించి మాట్లాడటానికి రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు జంకుతున్నారు. పార్టీ వాస్తవ పరిస్థితి గురించి అదే పార్టీకి చెందిన ఇద్దరు నేతలు ఫోన్‌లో మాట్లాడుకునేందుకు 'రికార్డు' భయం పట్టుకుంది. ఎవరితో ఏం మాట్లాడినా రికార్డు చేసి.. ఎక్కడ లీక్ చేస్తారోనన్న ఆందోళన నెలకొంది. ఎంత సన్నిహితులైనా సరే వాట్సప్ కాల్‌లోనే మాట్లాడుకుంటున్నారు. సాధారణ కాల్‌లో అసలు విషయాలు మాట్లాడటానికి చాలా మంది సుముఖత చూపడంలేదు. ఇదిలా ఉండగా ప్రధాన పార్టీల అభ్యర్థుల అనుచరులు హోటళ్లు, ప్రధాన కూడళ్ల వద్ద ఏ పార్టీ పరిస్థితి ఎలా ఉందని.. ఏ నాయకులు పార్టీకి అనుకూలంగా ఉన్నారని.. ఎవరు వ్యతిరేకంగా ఉన్నారని ఆరా తీస్తున్నారు. వ్యతిరేకంగా మాట్లాడే వారికి వీరు వత్తాసు పలుకుతూనే.. తమ మొబైల్ ఫోన్లలో వాయిస్ రికార్డు చేసి సదరు నేతలకు వినిపిస్తున్నారు. వీటిని మనసులో ఉంచుకుంటున్న అభ్యర్థులు.. తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారు ఎదురు పడితే ముఖం మీదే అడుగుతుండటంతో వారు బిక్కమొకాలేసుకుంటున్నారు. ఎన్నికల్లో గెలుపోటముల గురించి మేధావులు, తటస్థులు ఆలోచించి మాట్లాడే పరిస్థితులు దాపురించాయనే టాక్ వినిపిస్తోంది.

వృద్ధుడి దారుణ హత్య

ఎర్రవల్లిచౌరస్తా: ఓ వృద్ధుడు దారుణ హత్యకు గురైన ఘటన కోదండాపురం ఠాణా పరిధిలో గురువారం వెలుగు చూసింది. ఎస్ఐ కృష్ణదేవ కథనం మేరకు.. ఎర్రవల్లి మండలం వల్లూరుకు చెందిన పింజరి చిన్న హుస్సేన్ (68) బుధవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో భోజనం చేసి గ్రామ సమీపంలోని గోదాం దగ్గర బహిర్భూమికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో అర్ధరాత్రి దాటాక కుటుంబ సభ్యులు అటువైపు వెళ్లి చూడగా రక్తపు మడుగులో పడి మృతిచెంది కనిపించాడు. గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లు, కత్తులతో తల, మెడభాగంలో నరికినట్లు గుర్తించి స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. కోడలు పింజరి మాబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. గత నెలలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో చిన్న హుస్సేన్‌కు గొడవ జరిగిందని.. ఆ వ్యక్తి హత్యచేసి ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జూరాలకు 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు గురువారం 2,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 90 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 550 క్యూసెక్కులు, భీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,941 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.338 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఏదుల ప్రాజెక్టును పరిశీలించిన సీఈ



ఏదుల రిజర్వాయర్ వద్ద పనుల వివరాలు తెలుసుకుంటున్న సీఈ హమీద్‌ఖాన్

గోపాల్‌పేట: ఏదుల జలాశయం టేకాఫ్ స్లూస్ పనులను గురువారం నీటిపారుదలశాఖ సీఈ హమీద్‌ఖాన్ పరిశీలించారు. నెలాఖరు వరకు పంపుల డ్రైరన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైరన్ పూర్తయితే సుమారు 40 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని చెప్పారు. గతంలో కల్వకుర్తి ఎత్తిపోతలను ప్రతిపాదించినప్పుడు కేవలం నాలుగు పంపులతో 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చూశామన్నారు. కేఎల్ఐ కింద అయిదు లక్షల ఎకరాల సాగు భూమి ఉందని.. మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఏదుల ప్రాజెక్టుకు రెండు తూములు ఏర్పాటుచేసి 40 వేల ఎకరాలు, వట్టెం రిజర్వాయర్ తూము ద్వారా 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు వివరించారు. ఏదుల పంపులు ప్రారంభించేలోగా తూముల పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు డిజైన్, పనుల పురోగతి, డీపీఆర్ నిశితంగా పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఈ విజయ్‌భాస్కర్ రెడ్డి, డీఈలు సత్యనారాయణగౌడ్, విజయలక్ష్మి, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి: ప్రొ. హరగోపాల్



జిన్నారం గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రొ. హరగోపాల్

మరికల్: ఇథనాల్ కంపెనీ రద్దు ఆందోళనలో ప్రజలు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణలో నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ప్రొ. హరగోపాల్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని జిన్నారం, చిత్తనూర్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి దాడిలో గాయపడ్డ వారిని పరామర్శించారు. ఆయా గ్రామస్తులతో మాట్లాడి పోలీసుల ఆరాచకాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. కంపెనీ రద్దు కోసం కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు, రైతులు, గ్రామస్తులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు లాఠీచార్జ్ చేయడం సరికాదని.. అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన పోలీసులను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్ట్ సైంటిస్ట్ డా. బాబురావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, రాఘవాచారి, చంద్రశేఖర్, ఖలీల్, చక్రవర్తి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరికల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరోకరికి తీవ్ర గాయలైన ఘటన గురువారం ఎలిగండ్ల వంతెన వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధన్వాడ మండలం గున్ముక్లకు చెందిన మంగలి శివశంకర్(42) మరికల్‌లో ఓ హేర్‌కటింగ్ షాప్‌లో పని చేస్తున్నాడు. పనులు ముగించుకుని సాయంత్రం 7 గంటలకు గున్ముక్లకు స్కూటీపై తిరుగు ప్రయాణం అవుతుండగా మరికల్ చౌరస్తాలో ఎమ్మోనిపల్లికి చెందిన నవీన్ లిఫ్ట్ అడిగి స్కూటీ ఎక్కాడు. ఎలిగండ్ల స్టేజీ సమీపంలోని జాతీయ రహదారి వంతెన మలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కంటెయినర్ స్కూటీని ఢీకొనడంతో శివశంకర్ అక్కడిక్కడే మృతి చెందాడు. నవీన్‌కు తీవ్రగాయలు కావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు బలవన్మరణం



విజయ్‌మోహన్ రెడ్డి (ఫైల్)

గద్వాల క్రైం: కుటుంబ సమస్యలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన గద్వాల మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని న్యూ హౌసింగ్‌బోర్డులో నివాసం ఉంటున్న విజయ్‌మోహన్‌రెడ్డి(53) మోమిన్‌మొహల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా ఇంట్లో సమస్యలు తీవ్రం కావడంతో బుధవారం ఇంట్లోంచి ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి మండలంలోని పూడురూ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ పొలంలో చెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం స్థానిక రైతులు గమనించి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఆనంద్ చేరుకుని పరిశీలించగా మృతుడి గుర్తింపుకార్డు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మొదటి భార్య కొన్నేళ్ల క్రితమే రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ వివరించారు. రెండో భార్య స్వాతికి 6ఏళ్ల కూతురు ఉంది. కుమారుడు హేమంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LAND FOR SALE
- Clear Title Dry Agricultural Land two acres for sale Pothepally village, Veldanda Mandal, Kalwa kurthy Divison, Nagar kurnool District.Single Payment Transaction. No Brokers serious buyers with Available funds may send their offer on Whatsapp. documents will be shown to shortlisted buyer Contact : 8712202596

WANTED
- స్టార్ హోమ్ కేర్ HYD వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు జీడీ కేర్ ఐంటి / వంట పని స్త్రీ / పు కావలెను. జీతం : 18k -25k, రూం / భోజనం ఉచితం, ఏజెంట్ కమీషన్ కలదు. ఫోన్: 94904 82881, 86888 28228
- 10th, INTER, డిగ్రీ, ITI, డిప్లొమా (P/F) అయిన స్త్రీ/పులు మా కంపెనీలో పని చేయుటకు కావలెను. జీ.14వేలు+DA 6వేలు+ఫ్రీ రూం, నో ఫీజు. మహబూబ్‌నగర్. 99632 80512.
- అర్జెంటుగా పొలిటికల్ నాలెడ్జ్ ఉన్నవారు కావలెను. Qly మినిమం Inter Age 21-45 ఫ్రీ రూం+ ఫుడ్ & Daily 1000/- Contact: 9985433124
- REQUIRED CIVIL CONTRACTORS IRP Infra Tech Pvt Ltd, a leading telecom infrastructure company, is looking for CIVIL CONTRACTORS to execute Civil Foundation works for Telecom Towers and Solar Structures in various parts of Andhra Pradesh. Interested contractors can apply by E-mail to: civilirp23@gmail.com or contact us at: 79812 72969 91604 42234

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478
9010522215
9705135557
9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించి వివరాలు ప్రత్యక్షంగా తెలుసుకోవాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే రేటు లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంకు ఖాతాల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్